

త్యాగాలకు ప్రతీక.. బక్రీద్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను గురువారం జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. 8లో



క్రీడలతో ఆరోగ్యం

క్రీడలతో ఆరోగ్యం చేకూరుతుందని కేటీపీఎస్ సీఈలు అన్నారు. జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడల ముగింపులో వారు మాట్లాడారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 26°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ప్రభావం కొంత మేర కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

9న బ్రాహ్మణ గర్జన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కొత్తగూడెంటౌన్: బ్రాహ్మణుల ఆత్మగౌరవం కాపాడుకోవడంతో పాటు న్యాయపరమైన హక్కుల సాధనకు వచ్చే నెల 9న హైదరాబాద్ బ్రాహ్మణ గర్జన నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహనశర్మ తెలిపారు. కొత్తగూడెంలో బుధవారం సంఘం బాధ్యులు పలివేల సాంబశివరావు, దండిబొట్ల రామాంజనకుమారశర్మతో కలిసి ఆయన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దయనీయ స్థితిలో ఉన్న బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసేందుకు నిర్వహిస్తున్న ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, సీతారామయ్య, రమణ, కొదమసింహం పాండురంగాచార్యులు, ఉమామహేశ్వరావు, ముక్తేవి గిరీష్, పవన్‌కళ్యాణ్, అభిషేక్ శర్మ, రామకృష్ణ పాల్గొన్నారు.

30వ తేదీన కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 30న జరగాల్సిన డిగ్రీ సహా ఇతర పరీక్షలు వాయిదా వేశారు. పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. జూలై 1న గ్రూప్–4 పరీక్ష ఉన్నందున ఈనెల 30న జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు. ఆయా పరీక్షలు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని, మిగతా పరీక్షలు టైంటేబుల్ ప్రకారమే జరుగుతాయని ప్రకటించారు.

ప్రతీ ఇంటికి మొక్కలు పంపిణీ చేయాలి

పాల్వంచరూరల్: హరితహారంలో భాగంగా ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేయాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు అన్నారు. నాగారం కాలనీ గ్రామ పంచాయతీ నర్సరీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణల్లోనూ మొక్కలు నాటి సంరక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈజీఎస్ ద్వారా ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్, మునగ తదితర పండ్ల తోటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పోరండ్ల రంగా, సాంకేతిక సహాయకులు శ్రీనివాస్, లక్ష్మి, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

- స్లూయిజ్‌లు, పెద్ద మోటార్ల ఏర్పాటుతో పొంచి ఉన్న ప్రమాదం
- కరకట్ట మరమ్మతుపై అమలు కాని సీఎం హామీలు
- మంజూరుకు నోచుకోని రూ.వెయ్యి కోట్లు
- ఈ ఏడాది వరదలొస్తే కష్టమేనంటున్న ముంపు బాధితులు

కరకట్ట.. కాపాడేదెట్టా?



గోదావరి వరదల నుంచి కాపాడుతున్న కరకట్ట

భద్రాచలం: జగదభిరాముడి పాదాల చెంత, ఎన్నో పుణ్యక్షేత్రాలను దాటుకుంటూ భద్రాద్రి రామాలయం వద్ద ప్రవహిస్తున్న పవిత్ర గోదావరికి అనుసంధానంగా ఉన్న కరకట్ట గత 21 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలను పరిరక్షిస్తోంది. అనేక సార్లు గోదావరి మహోగ్ర రూపం దాల్చినా పట్టణం మునిగిపోకుండా కాపాడింది. అయితే ఇటీవల కరకట్ట మరమ్మతులకు గురైనా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. కరకట్ట పరిరక్షణ పేరుతో ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినా అది కార్యరూపం దాల్చ లేదు. మళ్లీ గోదావరి వరదల సీజన్ వస్తుండడంతో కరకట్ట తమను కాపాడుతుందా అని పట్టణ వాసులు, ముంపు ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



దెబ్బతింటున్న కరకట్ట..

కరకట్ట నిర్మాణం తర్వాత ఇప్పటివరకు గోదావరి మూడో ప్రమాద హెచ్చరికను దాటిఎనిమిది సార్లు ప్రవహించింది. గతేడాది అత్యధికంగా 71.5 అడుగులు మేర నీరు పోటెత్తింది. అయినా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదంటే కరకట్టే కారణం. అయితే పట్టణంలోని మురుగు నీరు, వర్షపు నీరు గోదావరిలో కలవడానికి ఏర్పాటు చేసిన స్లూయిజ్‌ల మరమ్మతుల విషయంలో అధికారుల నిర్లక్ష్యంతో కరకట్ట ఉనికికి ప్రమాదం ఏర్పడుతోంది. గతేడాది వచ్చిన వరదలతో యటపాక నుంచి సుభాష్‌నగర్ వరకు అనేక చోట్ల రెయిలింగ్, నిరంతరం పెద్ద మోటర్లతో నీటిని తోడడంతో ప్రధాన రహదారి మార్గం దెబ్బతిన్నాయి. మళ్లీ వరదల సీజన్ వస్తున్నా వీటి మరమ్మతును అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అటకెక్కిన సీఎం హామీ..

గతేడాది గోదావరి వరదలతో ముంపునకు గురైన బాధితులను పరామర్శించేందుకు భద్రాచలం వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరికి ఇరువైపులా కరకట్టను పటిష్టం చేయడంతో పాటు పొడిగించేందుకు, ముంపు బాధితులకు ఎత్తయిన ప్రాంతాల్లో పక్కా ఇళ్లు నిర్మించేందుకు రూ.1000 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కరకట్ట ఎత్తు 15 మీటర్లకు పెంచాలని అధికారులను ఆదేశించారు. కానీ ఏడాది కావస్తున్నా నేటికీ ఒక్క రూపాయి విడుదల కాక.. పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కరకట్ట మరమ్మతుల కోసం నీటిపారుదల శాఖ అధికారులు రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, అవి కూడా మంజూరు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే నిధులు విడుదల చేయాలని, కరకట్టకు పటిష్టంగా మరమ్మతుల చేసి వరదల బారి నుంచి తమను రక్షించాలని ముంపు ప్రభావిత ప్రాంత ప్రజలు కోరుతున్నారు. కరకట్ట మొత్తం దెబ్బతింటే వచ్చే వర్షాకాలంలో ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

2002లో రూ.53 కోట్లతో నిర్మాణం..

వర్షాకాలం వస్తోందంటే భద్రాచలం ఏజెన్సీ ప్రాంత ప్రజలు గజగజ వణికిపోయేవారు. 1986లో ఏర్పడిన జలప్రళయం సృష్టించిన నష్టం అంతా ఇంతా కాదు. ఆ తర్వాత ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఆ ఆలోచనల నుంచి వచ్చిన రూపమే కరకట్ట. అనేక సంవత్సరాల తర్జనభర్జనల తర్వాత ఎట్టకేలకు 2000 సంవత్సరంలో యటపాక నుంచి సుభాష్‌నగర్ కాలనీ వరకు రూ.53 కోట్ల నిధులతో సుమారు 6 కిలోమీటర్ల పరిధిలో కరకట్ట నిర్మాణ పనులు ప్రారంభించి 2002లో పూర్తి చేశారు. అప్పటి నుంచి పలుమార్లు గోదావరి ఉప్పొంగి ప్రవహించినా పట్టణ వాసులకు ఎలాంటి ప్రాణహాని లేకుండా కరకట్ట కాపాడింది.

నర్సరీల్లో నాణ్యత పాటించాలి

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

కొత్తగూడెంఅర్బన్: మిరప, కూరగాయల నారు విక్రయాల్లో నర్సరీదారులు నాణ్యత పాటించాలని, తద్వారా మంచి దిగుబడి వస్తుందని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. బుధవారం ఐడీఓసీలో ఉద్యాన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మిరప, కూరగాయల నారు పెంచే నర్సరీదారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లైసెన్స్ దారులు మాత్రమే నర్సరీలు నిర్వహించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని 33 లైసెన్స్‌డ్ నర్సరీల నుంచి మాత్రమే నారు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. కొనుగోలు సమయంలో రశీదు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ఆమోదం పొందిన నారునే పెంచాలని నిర్వాహకులను ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు పాటించని నిర్వాహకులతో పాటు నకిలీ నారు విక్రయించే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఏడాది జైలుశిక్ష లేదా రూ.50 వేలు జరిమానా లేదంటే రెండూ విధిస్తామని స్పష్టం చేశారు. ఉద్యానపంటలకు జిల్లా ప్రసిద్ధి అని, వేల కుటుంబాలు ఆయా పంటలపై ఆధారపడి ఉన్నాయని అన్నారు. అనంతరం ఉత్తమ రైతు, నర్సరీ నిర్వాహకులు పాపారావును సన్మానించారు. సమావేశంలో ఉద్యాన అధికారి జినుగు మరియన్న, వ్యవసాయ అధికారి అభిమన్యుడు, ఏడీఏ లాల్‌చంద్, కేవీకే శాస్త్రవేత్తలు నారాయణమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సేవలు అభినందనీయం

బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది సేవలను కలెక్టర్ అనుదీప్ అభినందించారు. బుధవారం ఐడీఓసీలో వైద్య సిబ్బంది కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్గంపాడు ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో రోజుకు 30 నుంచి 40 వరకు ఉండే ఓపీ నేడు 200 వరకు చేరిందని, ఇన్ పేషెంట్ల సంఖ్య 3 నుంచి 25కు పెరిగిందని, ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రజలకు గల నమ్మకానికి ఇదే నిదర్శనమని అన్నారు. మరింత నిబద్ధతతో పనిచేసి ఆస్పత్రికి మంచి పేరు తేవాలని సూచించారు. ఆస్పత్రికి ఆపరేషన్ థియేటర్, అదనపు పడకలు, మార్చురీ రెన్యూవేషన్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ జి.రవిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్, అనిత, హెడ్ నర్స్ శోభ, ఫార్మసిస్ట్ సురేష్, ల్యాబ్ టెక్నీషియన్ హరి, శివ పాల్గొన్నారు.

పీఆర్ ఈఈగా అదనపు బాధ్యతలు



మంగ్యానాయక్‌ను అభినందిస్తున్న సిబ్బంది

చుంచుపల్లి: జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా మంగ్యానాయక్ బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. గత నెల 20 వరకు కొనసాగిన ఈఈ కొండూరి సుధాకర్ వ్యక్తిగత కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఖమ్మం ఎస్‌ఈ సుదర్శన్ రావు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చూస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఎస్‌ఈ సుదర్శన్ రావుకు హైదరాబాద్ బదిలీ కాగా భద్రాచలం పీఆర్ డివిజన్ ఈఈ మంగ్యానాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన మంగ్యానాయక్‌ను కొత్తగూడెం కార్యాలయ సిబ్బంది ఆంజనేయులు, కోటయ్య, డీఈలు రామకృష్ణ, వేణుగోపాల్, ఏఈలు నాగేందర్, శివలాల్, జయరాజ్, సైదులు రెడ్డి తదితరులు అభినందించారు.

జిల్లా లీగల్ ఎయిడ్ 'కౌన్సిల్' నియామకం



భద్రాచలం లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శారద

భద్రాచలంఅర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ప్యానల్ న్యాయవాదులుగా పనిచేస్తున్న నలుగురిని ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుల పరిధిలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా జడ్జి పి.వసంత్ బుధవారం వివరాలు వెల్లడించారు. ఇల్లెందు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా సూరపాక సత్యనారాయణ, అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లీగల్ ఎయిడ్‌గా భూక్యా రవికుమార్ నాయక్, భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా బాసం శారద, మణుగూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా అంకం సర్వేశ్వర రావు నియమితులయ్యారని తెలిపారు. వీరు మూడేళ్ల పాటు ఆయా పదవుల్లో కొనసాగుతారని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ పరిధిలోని కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీల ఖాళీల భర్తీకి అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు జూలై 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష విధానం, సిలబస్, అభ్యర్థుల ఎంపిక తదితర వివరాలను పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు.

నిర్వాసితులకు నిరాశే!

- సమస్యలు చెప్పుకునే అవకాశం ఇవ్వని ద్విసభ్య కమిటీ
- సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌పై పూర్తి అధ్యయనం చేయాలన్న పిటిషనర్లు



సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద ద్విసభ్య కమిటీ సభ్యులు, అధికారులు

అశ్వాపురం: మండలంలోని కుమ్మరిగూడెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజీని చెన్నై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ద్విసభ్య కమిటీ బుధవారం సందర్శించింది. పర్యావరణ అనుమతి లేకుండా పనులు చేస్తున్నారంటూ కొందరు నిర్వాసితులు ఎన్‌జీటీకి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో క్షేత్రస్థాయి పరిశీలనకు కమిటీ సభ్యులైన మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ రీజినల్ డైరెక్టర్ కె.తరుణ్, గోదావరి నది జలాల నిర్వహణ బోర్డు సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్ రాగా, నిర్వాసితులు తమ గోడు చెప్పుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. కమిటీ సభ్యులు అమ్మగారిపల్లిలోని ఎల్‌అండ్‌టీ సంస్థ కార్యాలయంలో పిటిషనర్లు తెల్లం నరేష్, లక్ష్మీనారాయణ, జలవనరుల శాఖ అధికారులతో మాత్రమే సమావేశమై చర్చించారు. ఇరుపక్షాలు తమ వాదనలు వినిపించిన తర్వాత సీతమ్మ సాగర్ బ్యారేజీని పరిశీలించారు.

రోజంతా ఎదురుచూసినా..

ద్విసభ్య కమిటీకి తమ సమస్యలు తెలిపేందుకు ఎల్‌అండ్‌టీ కార్యాలయం వద్ద అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం గ్రామాలకు చెందిన సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులు రోజంతా ఎదురుచూసినా.. కమిటీ సభ్యులతో మాట్లాడే అవకాశం దక్కలేదు. కోర్టు ఉత్తర్వుల మేరకు పిటిషనర్లు, అధికారులతో మాత్రమే మాట్లాడామని, నిర్వాసితుల సమస్య అంశం తమ పరిధిలో లేదని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రాజెక్ట్‌పై అధ్యయనం చేయాలి...

సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, నిర్వాసితులకు న్యాయం చేయాలని పిటిషనర్ తెల్లం నరేష్ కమిటీ సభ్యులను కోరారు. 70 శాతం పనులు పూర్తయ్యాక ప్రజాభిప్రాయసేకరణ చేపట్టడం సరికాదని, నిబంధనలు ఉల్లంఘించి పనులు చేపడుతున్న అంశాలను కమిటీకి వివరించానని చెప్పారు. భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలని, జల విద్యుత్ కేంద్రంలో నిర్వాసితుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కమిటీ సభ్యులు తరుణ్, ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో తాము పరిశీలించిన అంశాలు, పిటిషనర్లు, అధికారుల వాదనలపై పూర్తి నివేదికను ఎన్‌జీటీకి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఔషధం..

- తొలకరి జల్లులతో జ్వరాలు మరూ
- ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఐపీ, ఓపీల సంఖ్య
- భద్రాచలం, అశ్వాపురంలో బాధితుల గుర్తింపు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు



దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: తొలకరి జల్లులు ప్రారంభం కాగానే భద్రాద్రి జిల్లాలో జ్వరాల వ్యాప్తి కూడా మొదలైంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో జ్వర పీడితులను వైద్యశాఖాధికారులు గుర్తించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఔట్, ఇన్ పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులు అంటున్నారు. ప్రధానంగా నీటి కాలుష్యం, దోమకాటు, నిల్వ పదార్థాలు తినడంతో జ్వరాలతో పాటు ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, తగు జాగ్రత్తలు పాటిస్తే జ్వరాల బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు, భద్రాచలంలోని ఏఎస్ఆర్, జగదీష్ కాలనీల ప్రజలు కొద్ది రోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్నారు. జ్వరంతో పాటు వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్నారు. ఈ రెండు మండలాల్లోనూ వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

దోమల నివారణకు చర్యలు..

వర్షాకాలంలో ప్రధానంగా జ్వరాలకు కారణమయ్యే దోమల నివారణకు గ్రామాల్లో మందు పిచికారీ ప్రారంభించారు. జూలై నెలాఖరు నాటికి అన్ని గ్రామాల్లోనూ పిచికారీ పనులు పూర్తి చేసేలా వైద్యాధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటివరకు జిల్లాలోని 50కి పైగా గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేశారు. ఎక్కువగా నీరు నిల్వ ఉంటే లార్వా ద్వారా దోమలు గుడ్లు పెట్టే అవకాశాలు ఉంటాయని, కూలర్లు, కొబ్బరిబొండాలు, సంపుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. జ్వరపీడితులకు చికిత్స చేసేందుకు గాను జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని పీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

వర్షాకాలంలో వచ్చే వ్యాధులివే..

వర్షాకాలంలో ప్రధానంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా, మొదడువాపు, వాంతులు, విరేచనలు, ఫ్లూ, గవదబిళ్లల వంటి వ్యాధులు ప్రబలుతుంటాయి. డెంగీ బారిన పడినవారు ఆందోళనకు గురై ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడతారు. అక్కడ హైడోస్ మందులు, ఇంజెక్షన్లు ఇవ్వడంతో ప్లేట్‌లెట్స్ పడిపోయే ప్రమాదం ఉందని వైద్యాధికారులు అంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల జ్వరాలకు మందులు అందుబాటులో ఉన్నాయని, బాధితులు ప్రభుత్వ ఆస్పత్రులనే ఆశ్రయించాలని చెబుతున్నారు. మలేరియా జ్వరం వస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వయసు ఆధారంగా నాలుగు గ్రూపులుగా విభజించి ఏసీటీ కిట్స్ (మందులు) అందిస్తున్నారని, తద్వారా మూడు రోజుల్లోనే పూర్తిగా కోలుకుంటారని అంటున్నారు. ఎలాంటి అనారోగ్యానికి గురైనా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంప్రదించడమే మేలని చెబుతున్నారు.

దోమ తెరలకు ప్రతిపాదనలు..

ఏజెన్సీలో అత్యధికంగా ఉన్న మారుమూల గ్రామాల్లో దోమల విజృంభణ ఎక్కువగా ఉంటుంది. వాటి నివారణకు ప్రభుత్వం దోమతెరలు పంపిణీ చేస్తుంది. 2020, 2021 సంవత్సరాల్లో జిల్లాలో 55 వేల వర కు దోమతెరలు పంపిణీ చేయగా, ప్రస్తుతం 75 వేల దోమతెరలు అవసరమని వైద్యాధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లాకు రాగానే పంపిణీ చేస్తామని చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



వర్షాకాలంలో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే అనారోగ్యం పాలు కాకుండా చూసుకోవచ్చు. నిల్వ పదార్థాలను తినొద్దు. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల వ్యాప్తిని అరికట్టాలి.

– శిరీష, భద్రాద్రి డీఎంహెచ్‌ఓ

దోమల మందు పిచికారీ చేస్తున్నాం



వర్షాకాలంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుంది. తద్వారా జ్వరాల బారిన పడేవారి సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుంది. దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్నాం. జూలై నెలాఖరు నాటికి జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం పూర్తవుతుంది.

– వెంకటేశ్వర్లు, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి

మా పరిస్థితి ఏంటి ?

ఇల్లెందు కాంగ్రెస్ నేతల్లో ఆందోళన

ఇల్లెందు: ఇల్లెందు నియోజవర్గంలో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న నేతల్లో టెన్షన్ నెలకొంది. ఇప్పటివరకు కేడర్‌ను రక్షించుకుంటూ కష్టకాలంలో పార్టీని బతికించుకున్న తమకు మొండిచెయ్యి చూపి పారాచూట్ అభ్యర్థులకు టికెట్ ఇస్తే తమ పరిస్థితి ఏంటని అంటున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న భూక్యా దళ్‌సింగ్‌నాయక్, చీమల వెంకటేశ్వర్లు, కామేపల్లి జెడ్పీటీసీ వెంకట ప్రవీణ్‌నాయక్, డాక్టర్లు రామచంద్రనాయక్, జి.రవి, ఆరెం పాపారావు, ఇల్లెందు, టేకులపల్లి, బయ్యారం మండలాల పార్టీ అధ్యక్షులు దొడ్డా డానియేల్, దేవా నాయక్, మునలయ్య తదితరులు పట్టణంలోని ఓ రహస్య ప్రదేశంలో సమావేశమయ్యారు. నిన్నటివరకు అధికారం అనుభవించి మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చే వారికి, ఈ నియోజకవర్గానికి ఎలాంటి సేవ చేయని వారికి టికెట్ ఇవ్వొద్దని అధిష్టానాన్ని కోరాలని నిర్ణయించారు. గత తొమ్మిదిన్నరేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని అంటున్నారు. ఇంకా ఈ సమావేశంలో ఎన్. శ్రీనివాసరెడ్డి, జలీల్, ఎంపీటీసీ మోహన్‌జీ, సర్పంచ్ రాంచందర్‌నాయక్, ఉప సర్పంచ్ శ్రీరాం నాయక్, హతీరాం, పుల్యా, రాందాస్, వెంకటేష్, కోటేష్, రమేష్, ప్రేమ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై చీమల వెంకటేశ్వర్లును ప్రశ్నించగా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

కలకలంగా మారిన సమావేశం..

కాంగ్రెస్ టికెట్ ఆశావహులు సమావేశం నిర్వహించడం కలకలంగా మారింది. ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో కీలకమైన వారంతా ఓ చోట సమావేశమై తమలో ఎవరికి ఇచ్చినా కలిసి పని చేస్తామని, పార్టీ ఫిరాయించిన వారికి, పారాచూట్‌లకు ఇస్తే వ్యతిరేకంగా పని చేస్తామని శపథం చేశారు. కాగా జూలై 2 ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడిచేందుకు ఈ నియోజకవర్గం నుంచి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో టికెట్ ఆశావాహులు సమైక్య రాగం ఎత్తుకుని ముందుకు రావటం చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన సింగరేణి జీఎం



కలెక్టర్ అనుదీప్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ బుధవారం కలెక్టర్ అనుదీప్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇల్లెందు ఏరియా జీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలెక్టర్‌ను కలిసిన ఆయన ఇక్కడి ఓసీ ఏర్పాటు, ఇల్లెందు ప్రాంత సమస్యలపై చర్చించారు. అనంతరం సన్మానించారు. ఆయన వెంట ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఎస్టేట్ అధికారి మహేశ్వర్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌ఫెడ్ అధికారుల పర్యటన

దమ్మపేట: రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో బుధవారం పర్యటించా రు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలో పామాయిల్ నర్సరీ, రైతుల కోసం నిర్మిస్తున్న గెస్ట్ హౌస్‌తో పాటు దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీలో విస్తరణ పనులను పరిశీలించి సూచనలు చేశా రు. ఆయిల్‌ఫెడ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, మేనేజర్లు బాలకృష్ణ, కళ్యాణ్, నాగబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో ఉన్న షెడ్యూల్డ్ గ్రామాల్లో 54 జీసీసీ, చౌక ధరల దుకాణాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీఓ రత్న కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ తెగల స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) వారు భద్రాచలంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు గడువు విధించినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎంసెట్ కౌన్సెలింగ్‌కు 420 మంది హాజరు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ నాగముని నాయక్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాగుతున్న ఎంసెట్ కౌన్సెలింగ్‌కు బుధవారం 420 మంది హాజరయ్యారు. అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేశామని ప్రిన్సిపాల్ బి.నాగముని నాయక్ తెలిపారు.

గ్రూప్-4 పరీక్ష కేంద్రాల పరిశీలన



ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో అధికారులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి పంచాయతీలో గ్రూప్-4 పరీక్ష కేంద్రాలను బుధవారం రూరల్ ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. వచ్చే నెల 1న ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో గ్రూప్-4 పరీక్ష నిర్వహించనున్నారు. కేంద్రాల్లో వాహనాల పార్కింగ్, ఇతర సౌకర్యాలపై కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో చర్చించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'గ్రీన్ ఎనర్జీ' కోసం పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న సింగరేణి అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో సోలార్ విభాగం జీఎం జీఎస్ జానకీరాం గ్రీన్ ఎనర్జీ కేంద్రాల ఏర్పాటుకు బుధవారం స్థలాలు పరిశీలించారు. జేకేఓసీ, జేకేఓసీ-2లో సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు. అక్కడి సంపుల్లోని నీటి నిల్వలను ఉపయోగించుకుని సోలార్ పవర్ ప్లాంట్ ఇన్‌స్టలేషన్, స్థలం సాధ్యాసాధ్యాలపై ఆరా తీశారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి స్థలం అనుకూలిస్తే ఇల్లెందుకు పునర్వైభవం వస్తుందని తెలిపారు. అధికారులు బి. వెంకటేశ్వర్లు, ఇంజనీర్ నరసింహారావు, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

త్యాగానికి ప్రతీక.. బక్రీద్

- నేడు ముస్లింల పర్వదినం
- జిల్లావ్యాప్తంగా మసీదులు ముస్తాబు..





వేడుకలకు ముస్తాబైన కొత్తగూడెం రామవరంలోని జామియా మసీదు

కొత్తగూడెంటౌన్/ఇల్లెందురూరల్/జూలూరుపాడు: దైవారాధన విశిష్టత ప్రచారం, ప్రవక్త త్యాగనిరతిని గుర్తు చేసుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారు. త్యాగం దైవాన్ని మెప్పించేదని విశ్వసిస్తారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్గాలు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నమాజ్ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం సూపర్‌బజార్ సెంటర్, రైటర్‌బస్తీ, బస్టాండ్ ఏరియా, 14 నంబర్ రామవరం, పంజాబ్‌గడ్డ, పాత కొత్తగూడెం, విద్యానగర్, పాలకేంద్రం రైటర్‌బస్తీ, గౌతంపూర్, రుద్రంపూర్ తదితర ప్రాంతాలతోపాటు ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేట తదితర పట్టణాలు, మండల కేంద్రాల్లోని ఈద్గాలు, మసీదులు నమాజ్‌కు సిద్ధం చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు నమాజ్ ప్రారంభమవుతుందని మత పెద్దలు తెలిపారు.

పండుగ రోజే మహ్మద్ ప్రవక్త సమాధి సందర్శన..

ఇస్లాం పంచసూత్రాలైన ఇమాన్ (అల్లాపై విశ్వాసం), నమాజ్ (ప్రార్థన), రోజా (ఉపవాసం), జకాత్ (దానం), హజ్ (మక్కాయాత్ర)లను ఆచరించాలని మత పెద్దలు చెబుతుంటారు. ఇందులో రోజా, జకాత్ రంజాన్ మాసంలో పాటిస్తారు. 'హజ్'ను బక్రీద్ మాసంలో చేస్తుంటారు. పవిత్రంగా భావించే సౌదీ అరేబియాలోని మక్కా , మదీన ప్రాంతాలను ఆర్థిక స్థోమత కలిగిన ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా సందర్శిస్తుంటారు. బక్రీద్ పర్వదినం రోజు మక్కా నగరంలోని 'కాబా', మదీన నగరంలోని మహ్మద్ ప్రవక్త సమాధిని దర్శించుకుంటారు. దీనినే హజ్ అంటారు.

ఇబ్రహీం త్యాగాన్ని మెచ్చిన అల్లా

ఖురాన్ ప్రకారం.. భూమిపైకి అల్లా పంపిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఆయన మక్కా పట్టణాన్ని నిర్మించి నివాస యోగ్యంగా మార్చారు. అల్లా ఆరాధన కోసం కాబా అనే ప్రార్థనా మందిరాన్ని కూడా నిర్మించి దైవ ప్రవక్తగా పేరుపొందాడు. ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్ మెడపై కత్తి పెట్టి జబాహ్‌కు ఉద్యుక్తుడవుతుండగా.. అతని త్యాగానికి మెచ్చిన అల్లా ఇస్మాయిల్‌కు బదులుగా ఓ జీవాన్ని బలివ్వాలని జిబ్రాయిల్ అనే దూత ద్వారా కోరతాడు. అప్పటి నుంచి బక్రీద్ రోజు ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందని ముస్లింలు భావిస్తున్నారు.

ఖుర్బానీ..

ఖుర్బానీ అంటే పేదలకు మాంసాన్ని దానం ఇవ్వడం, త్యాగం, సామీప్యం, సమర్పణ అనే అర్థాలు ఉన్నాయి. ఖుర్బానీ ద్వారా రక్త మాంసాలు సమర్పించడం కాదని, అవి అల్లాకు చేరవని, భక్తి, పారాయణత హృదయంలో జనించే త్యాగభావం, భయభక్తులు మాత్రమే అల్లాకు చేరుతాయని ముస్లింల భావన. బక్రీద్ రోజు నమాజ్ పూర్తయ్యాక పొట్టేలును బలి ఇచ్చి, ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు దానం చేస్తారు. మూడో భాగం ఇంట్లోనే వండి స్నేహితులకు, ఆత్మీయులకు విందు ఏర్పాటు చేస్తారు.

త్రికరణ శుద్ధితో ఆచరించాలి



ఖురాన్‌లో లిఖితమైన నియమాలను ప్రతి ముస్లిం త్రికరణశుద్ధితో ఆచరించాలి. అప్పుడే మనశ్శాంతి కలుగుతుంది. మానవాళిలో ఆవహించి ఉన్న పశుతత్వాన్ని నిర్మూలించడమే దైవానికి ప్రీతికరమని చెప్పటమే బక్రీద్ అంతర్థారం. ఆర్థిక స్థోమత కలిగిన బక్రీద్ పర్వదినాన ఖుర్బానీ ఇవ్వాలి. హజ్ యాత్రకు ప్రాధాన్యమివ్వాలి.

– ఎండీ.ఇరాహిత్, ప్రభుత్వ ఖాజీ, ఇల్లెందు

త్యాగనిరతికి నిదర్శనం



త్యాగనిరతికి ప్రతీక.. బక్రీద్. ఇస్లాం నిర్దేశించే పండుగల్లో ఒకటి దానాలు విస్తృతంగా చేస్తూ జరుపుకునే రంజాన్ కాగా, రెండోది త్యాగం చేస్తూ జరుపుకునేది బక్రీద్. ఇతరుల పట్ల ఉండే ఈర్ష్య, ద్వేషం, అమితంగా ప్రేమించే వాటి బలహీనతలు, చెడు కోరికలను బలి ఇవ్వటమే త్యాగనిరతికి నిదర్శనం.

–షేక్ ఆరీఫ్ మౌలీ సాహెబ్, జూలూరుపాడు

వైభవంగా బాహుడా యాత్ర

ముగిసిన జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు



యాత్రలో పాల్గొన్న భక్తులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో బుధవారం జగన్నాథ బాహుడా యాత్ర వైభవంగా నిర్వహించారు. భారజల కర్మాగారంలో పనిచేస్తున్న ఒడిశా అధికారులు, ఉద్యోగులతో ఏర్పడిన ఉత్కల్ పతాగర్ సమితి ఆధ్వర్యంలో గౌతమీనగర్ కాలనీలోని గుండీచాఘర్ మందిరంలో తొమ్మిది రోజులుగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజు బాహుడా యాత్రను జీఎం కేవీ.థాలే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛెరపహారా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాహుడా యాత్రలో వందల మంది భక్తులు పాల్గొని ఇరువైపులా బారులుదీరి రథాన్ని లాగారు. స్వాములను ఊరేగింపుగా ఉత్కల్ పతాగర్ మండపంలో యథాస్థానంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిదిరోజులపాటు జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవిలకు కాలనీ వాసులు, అధికారులు, ఉద్యోగులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం అధికారులు, ఉత్కల్‌పతాగర్ సమితి అధ్యక్షుడు ఆర్.పాణిగ్రాహి, సభ్యులు బలరాం సాహు భక్తులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలు పొందండి

న్యాయమూర్తి భానుమతి



మాట్లాడుతున్న జడ్జి భానుమతి

పాల్వంచరూరల్: భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, మహిళల సమస్యలకు సంబంధించి నిరుపేదలు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి తెలిపారు. మండల పరిధి దంతలబోరు గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన న్యాయ సేవా సదస్సులో ఆమె మాట్లాడారు. డబ్బులు పెట్టి లాయర్లను నియమించుకోలేని స్థితిలో ఉన్నవారు లీగల్ సర్వీస్ అథారిటీని ఆశ్రయించాలని సూచించారు. చట్టాలపై గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగాప్రసాద్, ఎంపీటీసీ నాగమణి, ఎస్‌ఐ శ్రీనివాస్, న్యాయవాదులు లక్కినేని సత్యనారాయణ, శివరామ్‌కుమార్ పాల్గొన్నారు.

పోడు సాగుకు సమాయత్తం



భూమి పూజ చేస్తున్న పోడు సాగుదారులు

ములకలపల్లి: మండల పరిధిలోని మాధారం అటవీ ప్రాంతంలో పోడు సాగుదారులు సేద్యం పనులు ప్రారంభించారు. పాల్వంచ రేంజ్ పరిధిలోని 277 కంపార్ట్‌మెంట్‌లో ఉన్న 120 ఎకరాల్లో ఎన్నో ఏళ్లుగా మాధారం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు పోడు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. గతేడాది అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ భూముల్లో మొక్కలు నాటేందుకు ప్రయత్నించగా, సాగుదారులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కేసులు కూడా నమోదయ్యాయి. తదుపరి మొక్కలు నాటగా, సాగుదారులు వాటిని తొలగించి విత్తనాలు జల్లారు. కాగా ఈయేడాది వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో బుధవారం సాగుదారులు వెళ్లి భూమి పూజ చేశారు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సాగుదారులను అక్కడి నుంచి పంపించి వేశారు.

10 మందిపై బైండోవర్ కేసులు

అశ్వారావుపేటరూరల్: భూ వివాదం నేపథ్యంలో బుధవారం పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. మండలంలోని మల్లాయిగూడెం గ్రామంలోని ఓ వ్యవసాయ భూమికి సంబంధించి గ్రామానికి చెందిన సంగం దుర్గారావు, దిబ్బగూడేనికి చెందిన నారం రాజశేఖర్ మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలోనే ఈ నెల 25న ఇరువర్గాలకు చెందిన సంగం దుర్గారావు, మడకం ప్రసాద్ దొర, సంగం అర్జున్, జక్కుల చిన్ని, బేతి సురేష్, నారం రాజశేఖర్, నారం ఆకాశ్‌రావు, వనమా మల్లికార్జున్, సోడెం దుర్గాప్రసాద్‌ల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో నందిపాడుకు చెందిన మడకం ప్రసాద్ కారు ధ్వంసమైంది. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకోగా 10 మందిపై కేసులు నమోదు చేసి, తహసీల్దార్ లూథర్ విల్సన్ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ఘర్షణ కేవలం భూమికి సంబంధించినదేనని, రాజకీయ పార్టీల మధ్య జరిగిన గొడవ కాదని తెలిపారు. కావాలనే కొందరు రాజకీయ పార్టీల ఘర్షణగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారని, తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాపర్ వైరు చోరీ



కాపర్ తీగ కోసం పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

కరకగూడెం: మండల పరిధిలోని కలవలనాగారం గ్రామంలో గుర్తు తెలియని దుండగులు కాపర్ వైరు చోరీ చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లోని 2 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ తీగను దొంగలించారని కరకగూడెం విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన తీగ విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట: మండల పరిధిలోని దురదపాడు గ్రామంలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,080 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

డీఎల్‌పీఓ విచారణ

ఇల్లెందురూరల్: గుండాల మండలంలో ఎంపీఓ, గ్రామపంచాయతీ కార్యదర్శులు పరస్పర ఫిర్యాదులపై డీఎల్‌పీఓ బుధవారం ఇల్లెందులో విచారణ నిర్వహించారు. ఎంపీఓ తమను తరచూ డబ్బులు అడుగుతున్నారని గ్రామపంచాయతీ కార్యదర్శులు డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండటంలేదని, నిధులు దుర్వినియోగం చేశారని డీపీఓకు ఎంపీఓ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శులను ఇల్లెందుకు రప్పించి విచారణ చేపట్టారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

దమ్మపేట: తీవ్ర అనారోగ్యం, ఆర్థిక సమస్యలు తాళలేక ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని నాచారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నాచారం గ్రామానికి చెందిన వీధుల నరసింహారావు(65) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఆర్థిక సమస్యలు కూడా ఉండటంతో నరసింహారావు పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

అశ్వారావుపేటరూరల్: తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీకి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ బజారులోని బొల్లిన బాబ్జీ కుటుంబం సహా బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలోనే ఈ నెల 25న సాయంత్రం ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చారు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించి వారిలో ఒకరు గోడ దూకి లోపలికి ప్రవేశించాడు. ఇంటి తలుపు తాళాన్ని సుత్తితో పగులగొట్టేందుకు యత్నించగా రాకపోవడంతో వెళ్లిపోయారు. ఈ దృశ్యాలు ఇంటి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. సీసీ ఫుటేజీ బయటకు రాగా బుధవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు రాగా, విచారణ చేస్తున్నామని ఎస్సై రాజేశ్ కుమార్ తెలిపారు.

బెదిరింపులపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: బెదిరింపుల ఘటనలో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. పట్టణంలోని కొత్తపేట కాలనీకి చెందిన లోకేష్ అనే వ్యక్తి ఇంటికి ఈ నెల 22న రాత్రి సమయంలో వినోద్, సందీప్‌తోపాటు మరికొందరు వెళ్లి దూషించారు. చంపుతానని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరు సిలిండర్లు స్వాధీనం

బూర్గంపాడు: సారపాకలో సివిల్ సప్లై అధికారులు బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న ఆరుగురుపై 6ఏ కేసులు నమోదు చేశారు. ఆరు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు డీటీ కస్తాల వెంకటేశ్వర్లు తెలిపారు.

వంట కార్మికురాలి నియామకం

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పాకలగూడెం ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలో వంట కార్మికురాలిని నియమించారు. దీంతో బుధవారం నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుబాటులోకి వచ్చింది. ఈ పాఠశాలలో వంట కార్మికులు లేక ఐదు నెలలుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించడం లేదు. ఇదే సమస్యపై ఈ నెల 28న 'పాకలగూడెం స్కూల్లో భోజనం బంద్' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఐటీడీఏ, విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఐటీడీఏ ఎస్‌ఆర్పీ సిద్ది నాగేశ్వరరావు పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుడు రాంబాబు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్షణమే గ్రామానికి చెందిన ఓ మహిళను వంట కార్మికురాలిగా నియమించారు. భోజనం సిద్ధం చేయించి విద్యార్థులకు అందించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేయిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడలతో ఉత్సాహం, ఆరోగ్యం

ముగిసిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ పోటీలు



ఉమెన్ జట్టుకు ట్రోఫీలు అందిస్తున్న సీఈలు



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న సీఈలు

పాల్వంచ: విధినిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొనే విద్యుత్ ఉద్యోగులు క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా ఉత్సాహంతో పాటు ఆరోగ్యం దరిచేరుతుందని కేటీపీఎస్ 5, 6, 7వ దశల సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఈఈ కె.శ్రీనివాసబాబు తెలిపారు. మూడు రోజులుగా కేటీపీఎస్ 7వ దశ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ ఉమెన్స్ గేమ్స్, లాన్ టెన్నిస్ పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. లాన్ టెన్నిస్ (మెన్) టీం ఈవెంట్‌లో కేటీపీఎస్ 7వ దశ ప్రథమ, కేటీపీఎస్ 5, 6వ దశలు ద్వితీయ, కేటీపీపీ తృతీయ, ఉమెన్ షటిల్ బ్యాట్మింటన్‌లో విద్యుత్ సౌధ ప్రథమ, కేటీపీఎస్ 7వ దశ ద్వితీయ, కేటీపీపీ తృతీయ, టేబుల్ టెన్నిస్‌లో కేటీపీఎస్ 5, 6 దశలు ప్రథమ, కేటీపీపీ ద్వితీయ, కేటీపీఎస్ 7వ దశ తృతీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే, క్యారమ్స్‌లో కేటీపీపీ ప్రథమ, 7వ దశ ద్వితీయ, విద్యుత్ సౌధ తృతీయ, టెన్నికాయిట్‌లో కేటీపీఎస్ 5, 6 దశలు ప్రథమ, 7వ దశ ద్వితీయ, కేటీపీపీ తృతీయ, చెస్‌లో విద్యుత్ సౌధ ప్రథమ, కేటీపీపీ ద్వితీయ, 7వ దశ తృతీయ బహుమతులు సాధించాయి. ఈ సందర్భంగా విజేతలకు సీఈలు ట్రోఫీలు అందజేసి అభినందించారు. జేఎస్(ఏడీఎం) కె.దుర్గామల్లీశ్వరి, జెన్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.లోహిత్ ఆనంద్, గేమ్స్ సెక్రటరీలు వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల ముప్పు ఉంది..

- విద్యార్థుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- ఐటీడీఏ ఏపీఓ, డీడీ డేవిడ్‌రాజు సూచన



పాల్వంచరూరల్: గిరిజన గురుకులం విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ డేవిడ్‌రాజు

ఇల్లెందు: వర్షాలు మొదలైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యాన గిరిజన హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యం విషయమై అప్రమత్తంగా వ్యవహరించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజు సూచించారు. ఇల్లెందులోని ఏటీడీఓ కార్యాలయంలో హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు, హెచ్‌ఎంతో బుధవారం ఆయన సమావేశమై మాట్లాడారు. విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేసి మొదటి నుంచే బోధనపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. వంట గదులు, డ్రెయినేజీలు, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడమే కాక విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. కాగా, ఉపాధ్యాయుల కేడర్ వారీగా జాబితా అందజేయాలని సూచించారు. సమావేశంలో ఏటీడీఓ రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి పెంచేందుకు 'బాయ్స్ ఫర్ చేంజ్'

పాల్వంచరూరల్: విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచడమే కాక మానసిక, శారీరక ఎదుగుదలపై అవగాహన కల్పించడానికి బాయ్స్ ఫర్ చేంజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ డీడీ డేవిడ్‌రాజ్ తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన మాట్లాడారు. కిన్నెరసానితో పాటు దమ్మపేట, గుండాల గిరిజన గురుకుల విద్యార్థులకు బాయ్స్ ఫర్ చేంజ్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్ టవర్ బ్యాటరీలు చోరీ

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ జేత్యాతండాలోని ఎయిర్‌టెల్ సెల్ టవర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. సుమారు రూ.లక్ష విలువైన బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని సంబంధిత ఉద్యోగులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.